క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ, ఎల్లమ్మబండ, పీఏజేఆర్ నగర్ కాలనీకి చెందిన మొగులయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. డీవీజీ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్. భాస్కర్, అగ్రవాసు, మహేష్, సుధాకర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో కూరగాయల ధరలు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ రైతు బజార్‌లో కూరగాయల ధరలు ఆదివారం 1 కిలోకి ఈ విధంగా ఉన్నాయి. టమాట 37, వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 55, బజ్జిమిర్చి 55, కాకరకాయ 32, బీరకాయ 26, క్యాబేజి 11, బీన్స్ 60, క్యారెట్ 41, గోబిపువ్వు 21, దొండకాయ 26, చిక్కుడుకాయ 55, గోరుచిక్కుడు 28, బీట్‌రూట్ 28, క్యాప్సికం 50, ఆలుగడ్డ 23, కీరా 23, దోసకాయ 16, సొరకాయ 20, పొట్లకాయ 18, కంద 40, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 22, మామిడికాయ 15 నుంచి 20, అరటికాయ 10 నుంచి 11, చామగడ్డ 25, ముల్లంగి 6 నుంచి 8, చిలగడ దుంప 35, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు 16 నుంచి 20, మునగకాయలు 5 నుంచి 6, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, ఉసిరి 85, కరివేపాకు 60 ధరలు ఉన్నాయి.

వి.రామారావునగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా రాజుచారి


అధ్యక్షుడిగా విజయం సాధించిన రాజుచారికి నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వి. రామారావు నగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికలు స్థానిక కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం జరిగాయి. సమీప అభ్యర్థులైన బండి యాదగిరి, వెంకటరమణ, సాంబలపై ఎస్. రాజు చారి గెలుపొందారు. అధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్. రాజు చారి మాట్లాడుతూ.. స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బి. వెంకట యాదవ్, ఆవుల సంజీవరావు పటేల్, సుబ్బన్న, కృష్ణ, నాగుల వినయ్‌కుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్


కార్యక్రమంలో పాల్గొన్న రవికుమార్ యాదవ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: యువత క్రీడల్లోనూ రాణించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్ అన్నారు. వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు వంశీరెడ్డి ఆధ్వర్యంలో జయనగర్ కాలనీలోని ఏఎంవై స్పోర్ట్స్ అరెనా కాంప్లెక్స్‌లో ఆదివారం ఎన్‌వీఆర్ బాక్స్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆటల్లో గెలవటం కంటే గెలుపుకోసం చేసే ప్రయత్నం గొప్పదన్నారు. కార్యక్రమంలో శ్రీహరియాదవ్, గోపాల్‌రావు, నర్సింగ్ యాదవ్, నరసింహాచారి, భాస్కర్ గౌడ్, వీరు యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శులు రేషన్ రాజు, వేణు, నాగేందర్ రెడ్డి, లక్ష్మణ్, విష్ణు, ఆంజనేయులు యాదవ్, భాస్కర్ గౌడ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

13 వరకు ఓపెన్ డిగ్రీ అవకాశం

మూసాపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2025–26 విద్యా సంవత్సరానికి కోర్సుల్లో అడ్మిషన్లకు ఈ నెల 13 వరకు అవకాశం ఉందని ఓపెన్ యూనివర్సిటి కూకట్‌పల్లి కో ఆర్డినేటర్ సాయికొండల్ ఆదివారం తెలిపారు. ఇంటర్, రెండు సంవత్సరాల ఐటీఐ, ఓపెన్ ఇంటర్, 10+2, చదివిన వారు, పాలిటెక్నిక్ కోర్సు ఉత్తీర్ణులైన వారు అడ్మిషన్ తీసుకోవచ్చన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ వంటి కోర్సుల్లో చేరడానికి అవకాశముందని తెలిపారు. వర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకొని కూకట్‌పల్లి స్టడీ సెంటర్‌లో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 7382929748 నంబర్‌కు సంప్రదించవచ్చన్నారు.

రోడ్లపై పారుతున్న మురుగు..

- వారం రోజులుగా ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు
- పరిష్కారం చూపని అధికారులు


తులసి నగర్‌లో కిలోమీటర్ల మేర రోడ్డుపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ తులసినగర్‌లోని లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం వీధిలో వారం రోజులుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మురుగునీరు ఏరులై పారుతుంది. సమీపంలో ఉన్న భూదేవిహిల్స్, జేఎస్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు, జగద్గిరిగుట్ట నుంచి వెలువడే మురుగునీరు తులసినగర్ డ్రైనేజీలో కలుస్తున్నది. పైపులైన్ సామర్థ్యం చిన్నగా ఉండటం, వర్షం నీటిలో కొట్టుకువచ్చిన వ్యర్థాలు డ్రైనేజీ పైపులైన్‌లో చేరడంతో అండర్ గ్రౌండ్ మ్యాన్‌హోల్స్ నిండిపోయి రెండు కిలోమీటర్ల మేర డ్రైనేజీ నీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంది. ఈగలు, దోమలు వృద్ధి చెంది పగలు, రాత్రి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దుర్గంధం, దుర్వాసనతో దగ్గు, జలుబు విష జ్వరాలు వ్యాపిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలని తులసి నగర్ వాసులు కోరుతున్నారు.

అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: కాలనీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి డివిజన్ ఏవీబీపురం కాలనీ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని, స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆటోలో నగదు బ్యాగు మర్చిపోగా..



కేపీహెచ్‌బీకాలనీ: ఆటోలో పొరపాటున నగదుతో కూడిన బ్యాగ్‌ను మరిచిపోయిన బాధితులకు పోలీసులు స్పందించి బ్యాగును అందజేశారు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. జగద్గిరిగుట్ట, లెనిన్ నగర్‌కు చెందిన లావణ్య, కృష్ణప్రియ ఇద్దరు అక్కాచెల్లెళ్లు. షాపింగ్ నిమిత్తం లెనిన్ నగర్‌లో ఆటో బుక్ చేసకుని కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్ 1కు వచ్చారు. ఆటోలో నగదుతో కూడిన బ్యాగ్ మరిచిపోయారు. ఆ తరువాత బ్యాగ్ ఆటోలో వదిలివేయడాన్ని గుర్తించి కేపీహెచ్‌బీ పోలీసులకు తెలిపారు. పోలీసులు వెంటనే స్పందించి ఆటోను గుర్తించారు. డ్రైవర్‌ను పిలిపించి బ్యాగును వారికి అప్పగించారు. బ్యాగులో లక్షా ఇరవై వేల రూపాయలు ఉన్నాయి. తక్షణమే స్పందించిన ఎస్ఐ లింగం, కానిస్టేబుల్ అనిల్‌ను సీఐ రాజశేఖర్ రెడ్డి అభినందించారు.

కోడి పందేలు ఆడుతున్న నలుగురి అరెస్టు



మూసాపేట: కోడిపందేలు ఆడుతున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. వెస్ట్ గోదావరి పెనుగొండకు చెందిన చిలకలపల్లి రామకృష్ణ (34), వనపర్తి జిల్లా చిన్న చింతకుంటకు చెందిన ఈ.రమేష్ (36,) కూకట్‌పల్లి సాయిచరణ్ కాలనీలో నివాసముంటున్న కంట్రకొండ మణికొండ (34), ఈస్ట్ గోదావరికి చెందిన బయారపు లక్ష్మణ్ (33) శంషీగూడలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలోని ఖాళీ స్థలంలో కోడి పందేలు ఆడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.6,200 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, నాలుగు కోళ్లు, ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా కనకదుర్గ ఆలయ వేడుకలు


అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: అంజయ్యనగర్ రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని కనకదుర్గమ్మ ఆలయ 11వ వార్షికోత్సవ సందర్భంగా అమ్మవారికి ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారిని అలంకరించారు. ఆలయ ఆవరణలో హోమం నిర్వహించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతి

కుత్బుల్లాపూర్: చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. దేవరయాంజాల్‌లోని లేబర్ క్యాంప్‌లో రంజన్‌కుమార్(28) లేబర్‌గా, సునీల్ (28) డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 3న రాత్రి 11 గంటల సమయంలో మద్యం తాగి ఇరువరి మధ్య గ్యాస్ సిలిండర్ విషయమై గొడవ జరిగింది. దీంతో ఇరువురి ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో గాయాలయ్యాయి. 7న ఉదయం సునీల్ ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పాటు తీవ్ర తలనొప్పి రావడంతో అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొలన్ నారాయణరెడ్డి అసోసియేషన్ ఎన్నిక



నిజాంపేట్: ఎన్నికల ప్రక్రియ నిర్వహించి ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారా ఎన్నుకోబడ్డ నూతన అసోసియేషన్ బాడీని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ప్రకటించారు. ఆదివారం కొలన్ నారాయణరెడ్డి కాలనీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చైర్మన్‌గా చిర్రా శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా కొలన్ వెంకట్‌రెడ్డి, ప్రెసిడెంట్‌గా విజయ్ కుమార్ గుండాల, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రమణారెడ్డి జడ్పీ, వైస్ ప్రెసిడెంట్ జనార్ధన్‌రెడ్డి బిజ్జుల, జనరల్ సెక్రటరీగా రమేష్ వంకుడోత్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా విజయ్‌కుమార్ కావూరి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నరేష్ నల్లూరి, జాయింట్ సెక్రటరీగా నాగిరెడ్డి, హనుమంతు ప్రసాద్, ట్రెజరర్‌గా సుబ్బరాజు, జాయింట్ ట్రెజరర్‌గా జయపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు.

తెలంగాణ కబడ్డీ లీగ్ ఫైనల్ రౌండ్ సెలక్షన్స్


సమావేశంలో మాట్లాడుతున్న కాసాని వీరేష్


పాల్గొన్న క్రీడాకారులు

నిజాంపేట్: తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ కబడ్డీ లీగ్ ఫైనల్ రౌండ్ సెలక్షన్స్ విజయవంతంగా పూర్తైంది. మొత్తం 220 మంది ఆటగాళ్లు పాల్గొన్నారు. కఠినమైన ఎంపిక ప్రక్రియ అనంతరం అన్ని విభాగాల నుంచి 8 జట్లు ఎంపికయ్యాయి. కార్యక్రమానికి తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని వీరేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, సెలక్షన్స్ కమిటీ చైర్మన్ అజీజ్‌ఖాన్, సెలక్షన్స్ కమిటీ సభ్యులు, టెక్నికల్ అధికారుల పర్యవేక్షణలో ఈ ఎంపిక కార్యక్రమం జరిగింది. తెలంగాణ కబడ్డీ లీగ్ ఆగస్టు 28 నుంచి ప్రారంభం కానుందని నిర్వాహకులు తెలిపారు.

సిద్ధమవుతున్న భారీ గణనాథుడు


మూసాపేటలో నవయువక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్ధమవుతున్న భారీ గణనాథుడు

మూసాపేట: వినాయక నవరాత్రుల సందడి మొదలైంది. వాడవాడలా వినాయక మండపాల ఏర్పాటులో మండప నిర్వాహకులు కమిటీలు వేసుకోవటం, విగ్రహాల బుకింగ్, మండపాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. కొందరు ప్రతిష్ఠించిన చోటే వినాయకుడిని తయారు చేస్తున్నారు. ఆగస్టు 27 వినాయక చవితి సందర్భంగా ఇప్పటికే పలుచోట్ల షోలాపూర్, ముంబాయి వంటి ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా తయారు చేసిన బొజ్జ గణపయ్యలను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. వినాయక ఉత్సవాల్లో ఖైరతాబాద్ తరువాత మూసాపేట ప్రాంతానికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడి భారీ గణపయ్య సుమారు 61 సంవత్సరాలకు పైగా స్థానికులచే పూజలు అందుకుంటున్నాడు. ప్రతి సంవత్సరం ఒకే చోట తయారు చేసి పూజలు చేస్తారు. నవయువక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 61 ఏళ్లకు పైగా వినాయక నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడు అడుగుల నుంచి ప్రారంభమైన ఏకదంతుడు విగ్రహం ఎత్తు నేటికి 30 అడుగులకు చేరింది. ఖైరతాబాద్ విగ్రహాన్ని తయారు చేసిన కళాకారులే ఇక్కడ కూడా విగ్రహాన్ని తయారు చేస్తున్నారు. ఖైరతాబాద్ విగ్రహం తరువాత రెండవ అతి పెద్ద విగ్రహంగా మూసాపేట గణనాథుడు పేరు గాంచాడు. ప్రస్తుతం 30 అడుగుల కుమారస్వామి వినాయకుడి రూపంలో రూపుదిద్దుకుంటున్నాడు.

వరదనీరు సాఫీగా వెళ్లేలా కృషి


సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శిల్ప బృందావనంలో వరదనీరు రోడ్లపై ప్రవహించడంతో సమస్యగా ఉందని కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకురాగా ఆయన ఆదివారం జీహెచ్‌యంసి సిబ్బందితో కలిసి సమస్యను పరిశీలించారు. వరదనీరు సాఫీగా వెళ్లేలా కృషి చేస్తానని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం శిల్ప బృందావనంలో వరదనీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారులతో కలిసి పరిశీలించారు. ఇప్పటికే వరద నీటి డ్రైనేజీ నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వెంటనే నిర్మాణ పనులు మొదలు పెట్టి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, నరసింహారెడ్డి, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీకి మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..


మరమ్మతులు చేయిస్తున్న ఇన్‌చార్జి మేనేజర్ అన్విత్‌కుమార్

మోతీనగర్: మూసాపేట డివిజన్ స్నేహపురి కాలనీలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ అనే శీర్షికతో ఆదివారం కూకట్‌పల్లి సాక్షి జోన్‌లో ప్రచురితమైంది. దీంతో సంబంధిత జలమండలి ఇన్‌చార్జి మేనేజర్ అన్విత్ కుమార్ స్పందించి డ్రైనేజికి ఆదివారం మరమ్మతులు చేపట్టారు. అదే విధంగా డ్రైనేజీలోకి తినుబండారాలు, ఆహార పదార్థాలు వేయకుండా హోటల్ యజమానిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతేకాకుండా డ్రైనేజీకి శాశ్వత మరమ్మతులు చేపడతామని తెలిపారు. ప్రత్యేక డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేసుకోవాలని హోటల్ యజమానికి ఆదేశించారు. లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆత్మీయ సమావేశం


సమావేశంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ తదితరులు

మూసాపేట: కూకట్‌పల్లిలోని సెంట్రింగ్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ హాజరై నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను అభినందించారు. సెంట్రింగ్ కార్మికులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో తుకారం, యూనియన్ అధ్యక్షుడు సత్యం, సభ్యులు నారాయణ, పాల్గుణరావు, లక్ష్మీనారాయణ, తేజ, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాఖీ పౌర్ణమి వేడుకలు

మోతీనగర్: అన్నా చెల్లెళ్ల అనుబంధానికి, ఆప్యాయతకు నిదర్శనమే రాఖీ పౌర్ణమి పండుగ అని ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ చంద్రశేఖర్, ప్రముఖ్ దుంపల కైలేష్ అన్నారు. ఆదివారం అల్లాపూర్ డివిజన్ తులసినగర్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఠాకూర్ అంకిత్‌సింగ్ మాట్లాడుతూ.. రాఖీ పౌర్ణమి వేడుకలు ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ ఉన్నా నిర్వహించుకోవటం భారతదేశ సంస్కృతి సంప్రదాయానికి నిదర్శనం అని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ పాండు యాదవ్, నాయకులు రఘురాం, ఆంజనేయులు, దామోదర్ నేత, సురేందర్, శ్రీకాంత్, చింటూ, రామకృష్ణ, శ్రీశైలం, మనోజ్, ఎల్లయ్య, దుర్గారాం, శివ, శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

చింతల్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి వేడుకలు జైగౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు రామారావుగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో జైగౌడ్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడ్, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు కిషోర్‌గౌడ్, అధికార ప్రతనిధి బీసు వెంకటేశంగౌడ్, శంకర్‌గౌడ్, సాయిగౌడ్ తదితరులు హాజరయ్యారు

పుంజాల శివశంకర్‌కు ఘన నివాళి


పూలమాలేసి నివాళులర్పిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు పర్వత సతీష్‌కుమార్ పటేల్ తదితరులు

కూకట్‌పల్లి: హిందూ బీసీ మహాసభ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో దివంగత నేత పుంజాల శివశంకర్ జయంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత సతీష్‌కుమార్ పటేల్ మాట్లాడుతూ.. కేంద్రమంత్రిగా, గవర్నర్‌గా దేశంలో క్లిష్టమైన పరిస్థితుల్లో స్వర్గీయ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీకి ప్రత్యేక సలహాదారుడిగా ఉంటూ దేశం కోసం ఎంతో కృషి చేశారన్నారు. అదే విధంగా బీసీ సంక్షేమం కోసం ఎన్నో కొత్త చట్టాలను, రిజర్వేషన్‌ను అమలు చేయటంలో తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే విధంగా కార్యక్రమాలను చేపట్టారన్నారు. కార్యక్రమంలో బీసీ ఉద్యమ నాయకులు అమరేంద్ర, హిందూ బీసీ జాతీయ అధ్యక్షులు బత్తుల సిద్ధేశ్వర పటేల్, కోలా జనార్ధన్, అంబేడ్కర్ ఆజాద్ అధ్యక్షులు కొంగర నరహరి, హిందూ బీసీ మహా సభ ప్రధాన కార్యదర్శి చింతలగారి వెంకటస్వామి, కందికట్ల నరసింహ, బత్తుల రాంనర్సయ్య, జక్కుల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ మాజీ చైర్మన్ బలరామమూర్తి మృతి


బలరామమూర్తి (ఫైల్)

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగ నగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయం మాజీ చైర్మన్ బలరామమూర్తి శనివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానికులు బలరామమూర్తి మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గుమ్మడిదల సుధాకర్ మాట్లాడుతూ బలరామమూర్తి రెండు పర్యాయాలు ఆలయ కమిటీ చైర్మన్‌గాను సభ్యుడిగా పనిచేశారని గుర్తు చేశారు.

వైభవంగా అమ్మవార్ల బోనాల జాతర



దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేటలోని బంగారు మైసమ్మ దేవి ఆలయ బోనాల జాతర ఘనంగా జరిగింది. అదే విధంగా దుండిగల్‌లోని రాజ రాజేశ్వరీ పోచమ్మ దేవతల అమ్మవార్ల బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు వందలాదిగా తరలివచ్చి బోనాలను సమర్పించి అమ్మవార్ల మొక్కులను చెల్లించుకున్నారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.


హాజరైన ఎంపీ ఈటల రాజేందర్